క్లుప్తంగా

సూరిబాబు సేవలు అభినందనీయం



సీఆర్‌పీఎఫ్ మాజీ ఎస్సై సూరిబాబును సత్కరిస్తున్న గ్రామస్తులు

తుని రూరల్: దేశ రక్షణలో విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన సీఆర్‌పీఎఫ్ ఎస్సై పెదపాటి సూరిబాబు సేవలు వెలకట్టలేనివని హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామం హంసవరం వచ్చిన సూరిబాబును గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేరీఅవినాష్ మాట్లాడుతూ సరిహద్దుల్లో దేశరక్షణ కోసం నిరంతర సేవలు అందించడం సూరిబాబు అదృష్టమన్నారు. అనంతరం జగనన్న పాల వెల్లువ పథకంలో రైతులకు బ్యాంకు ద్వారా మంజూరైన రుణాలను అందించారు. పంచాయతీ కార్యదర్శి ఈ.శంకర్, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన మండల అత్యవసర సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి నిమిత్తం ఉపాధి హామీ పథకంలో మంజూరైన రూ.60 లక్షల పనులు ఆమోదించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఫర్నీచర్ కొనుగోలుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

రౌతులపూడి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు గురువారం వైద్య పరీక్షల కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్ ఆర్థిక సాయంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా సీహెచ్‌సీ డాక్టర్లు గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఏఎంసీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, వైద్యులు జానకీదేవి, సునీత సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం



నమూనా ఆలయం వద్ద ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఈఓ చంద్రశేఖర్

అన్నవరం: జాతీయ రహదారిపై గల సత్యదేవుని నమూనా ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన దివిస్ లాబరేటరీస్ సంస్థ రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానం అభ్యర్థన మేరకు గతంలో కూడా రత్నగిరిపై రూ.90 లక్షలతో దివిస్ సంస్థ ఆరు చోట్ల ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న దివిస్ లాబరేటరేస్ ప్రతినిధులను అభినందించారు.దివిస్ ప్రతినిధులు శ్రీనివాస్, సుధాకర్, వాసు, బాబు, నాగరాజు, బాలకృష్ణ, తేజ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: తుని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించే అతిథి అధ్యాపకుడు (గెస్ట్ లెక్చరర్) పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్‌లో పీజీతో పాటు ఎన్ఈటీ, ఎస్ఈటీలో పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 15న కళాశాలలో డెమో క్లాసుకు హాజరు కావాలని కోరారు.

గౌరీదేవి ఉత్సవాలు ప్రారంభం

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో గౌరీదేవి ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి గ్రామంలో గౌరీదేవి ఉత్సవాలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా గౌరీశంకరుల విగ్రహాన్ని బాణసంచా కాల్పులు, బ్యాండ్‌మేళాలు, తీన్‌మార్ డ్యాన్సుల నడుమ గ్రామంలో ఊరేగించి మండపంలో ప్రతిష్ఠించారు. నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు



ఎస్.అగ్రహారంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అల్లిపూడిలో సంక్షేమ పథకాల వివరాలను తెలిపే ఫ్లెక్సీని ఆవిష్కరించిన ఎంపీపీ శ్రీనివాసు



ఏలేశ్వరంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మల్లిసాలలో పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- చినశంకర్లపూడిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' ప్రారంభం



చినశంకర్లపూడిలో ఎమ్మెల్యే పర్వతతో కలిసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వీరబాబు



గోకవరంలో మా నమ్మకం నువ్వే జగన్ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ప్రత్తిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని చినశంకర్లపూడిలో గురువారం ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామంలో రూ.2 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.2.02 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును, ప్రధాన రహదారిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబుతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీ పిల్లా చిన్నా, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్నం వెంకటేశ్వరరావు, శేరు కృష్ణ, దోశ చిట్టిబాబు, ఏడిద రెడ్డినాయుడు, గొంతిన సురేష్, బెహరా దొరబాబు, ఆకుల వీరబాబు, మారిశెట్టి శివ, వైస్ ఎంపీపీ బంకు శ్రీను, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు పాల్గొన్నారు.

మల్లిసాల ప్రజలకు రూ.16.50 కోట్ల లబ్ధి

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల సచివాలయం-2 పరిధిలో ప్రజలకు గడిచిన నాలుగున్నరేళ్లలో వివిధ పథకాల కింద రూ.16.50 కోట్లు లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మల్లిసాలలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి గ్రామంలో పాదయాత్ర చేశారు. మల్లిసాలలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించిన ఆర్థిక సాయాన్ని తెలిపే డిస్ ప్లే బోర్డును ప్రారంభించారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు ఆధ్వర్యంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చేసిన మేలును వివరించాలి

గోకవరం: గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పార్టీ నాయకులకు సూచించారు. గోకవరంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. నాలుగు సచివాలయాల పరిధిలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. గోకవరంలో దాసరి వారి వీధిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం గ్రామంలో సచివాలయం భవనం, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మన్నదొర, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్ ప్రారంభం

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నియోజకవర్గంలో గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఏలేశ్వరంలో పార్టీ పట్టణాధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక 17వవార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, కోరాడప్రసాద్, పైల విజయ్‌కుమార్ తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. సిరిపురంలో పార్టీ మండల అధ్యక్షుడు అడపా పార్థసారథి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, సర్పంచ్ పీతల నూకరాజు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనే రావాలి

తొండంగి: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని పెరుమాళ్లపురంలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు గత నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఎంపీడీఓ పసపులేటి సతీష్, తుని ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, పార్టీ నాయకులు దడాల విజయ్, గంగిరి అడవియ్య, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి సీఎం జగన్

కోటనందూరు: పేదల ఆశాజ్యోతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని అల్లిపూడిలో గురువారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాలయ చినబాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్, మంత్రి రాజాలను ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఏఎంసీ జిల్లా అధ్యక్షుడు లంక ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, చింతకాయల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

శంఖవరం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను అన్నారు. మండలంలోని మండపంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును, గ్రామంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రజలకు నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం, జెడ్పీటీసీ తరుమ్ రాజేశ్వరి, పార్టీ నాయకులు గాబు కృష్ణ, నక్కా మాణిక్యం, ఎంపీడీఓ జి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, కర్రి సూర్యకుమార్, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, యల్లపు నానాజీ, దాడి పెదబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడులో గురువారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచె రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబ్బిణ్ణి వీరబాబు, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే లక్ష్యం

రౌతులపూడి: పేదల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం అన్నారు. మండలంలోని ఎస్.అగ్రహారంలో గురువారం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు గడిచిన నాలుగున్నర ఏళ్లలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం ప్రధాన రహదారిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్ పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వి.భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, సర్పంచులు సర్నం శ్రీను, మిరియాల చిట్టిబాబు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- దొండవాకలో గడపగడపకూ మన ప్రభుత్వం



దొండవాకలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని దొండవాకలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సీఎం జగన్ పరిపాలన ఎలా ఉందని, మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపిస్తారా ? అని ప్రశ్నించారు. ప్రభుత్వం పనితీరు బాగుందని, సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలను ఇంటికే అందిస్తోందన్నారు. రానున్న కాలంలో మరింత మెరుగ్గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూనే సంక్షేమ పథకాలను అందించనున్నట్టు మంత్రి తెలిపారు. రెండోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూసేకరణ చేసి మిగిలిన లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు అందిస్తామన్నారు. తొలుత గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రైతులకు ప్రభుత్వ పథకాలన్నీ సకాలంలో అందేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఏడీఏ సుంకర బుల్లిబాబును ఆదేశించారు. రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, తహసీల్దార్ శివకుమార్, ఎంపీడీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని తొండంగి, కృష్ణాపురం, ఒంటిమామిడి, దానవాయిపేట, పి.అగ్రహారం, ఏవీ నగరం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, కోదాడ, పెరుమాళ్లపురం, పాతచోడిపల్లిపేట, అన్నయ్యపేట, జీఎంపేట, వేమవరం, పైడికొండ, ఆనూరు గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

తుని: హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 11న మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే విశ్వరూప మహా సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం మాదిగ ప్రతినిధులతో కలిసి విశ్వరూప మహా సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ మహాసభకు మాదిగలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరుగుల సత్తిబాబు, జుత్తుక మురళీ, జుత్తుక సంజయ్, ఆరుగుల ప్రవీణ్, సాకా నూకరాజు, గ్రంధం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే సర్వే చేయండి

- పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు



రాపాకలో సర్వేను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు

తుని రూరల్: రైతుల అనుమానాలను నివృత్తి చేసి, వారి సమక్షంలోనే భూముల రీ సర్వే పూర్తి చేయాలని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు అధికారులకు సూచించారు. మండలంలోని కేఓ మల్లవరం, రాపాక, దొండవాక గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం తుని తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే చేయాలన్నారు. రైతుల సందేహాలు, అనుమానులను తీర్చాలన్నారు. ప్రభుత్వ భూములకు పక్కాగా హద్దులు ఉండాలన్నారు. త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ శివకుమార్, సర్వేయర్ దేవుడు, వీఆర్వోలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్యాబ్‌ల పంపిణీ

గోకవరం: స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. గురువారం భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నలుగురు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నాయకులు దాసరి సతీష్‌బాబు, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, ఉనుకూరి యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

తునిలో చోరీ

తుని: స్థానిక సాయినగర్ ఎల్ఐసీ కార్యాలయం వెనుక ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... సాయినగర్‌లో నివాసం ఉంటున్న వాకల శ్రీనివాసరావు బుధవారం రాత్రి కొత్తి ఇంటి పనుల కోసం వేరే ప్రాంతానికి వెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లగా బీరువాలో సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని నగలు, నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి పట్టణ పోలీసులకు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. బంగారం, నగదు కలిపి రూ.2 లక్షల వరకూ చోరీకి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

రత్నగిరిపై తాచుపాము హల్‌చల్

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రసాదం తయారీ భవనంలోని పంచదార గొడౌన్‌లో గురువారం తాచుపాము గురువారం హల్‌చల్ చేసింది. దేవస్థానం సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. దేవస్థానం ఈఓ సీసీగా పనిచేస్తున్న బీఎస్ఎన్ రాజు చాకచక్యంగా పామును హతమార్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గోడౌన్‌లో వందలాది పంచాదార బస్తాలు ఎల్లప్పుడూ నిల్వ ఉంటాయి. అవసరమైనప్పుడు సిబ్బంది లిఫ్ట్ ద్వారా వాటిని ప్రసాదం తయారు చేస్తున్న మొదటి అంతస్తుకు తరలిస్తారు. గురువారం యథావిధిగా పంచదార బస్తాలు తీసేందుకు సిబ్బంది వెళ్లగా తాచుపాము బుసలు కొట్టింది. దీంతో సిబ్బంది హడలిపోయారు. విషయం ఈఓ సీసీ బీఎస్ఎన్ రాజుకు తెలియడంతో ఆయన పంచదార బస్తాలను తొలగించి పామును కర్రతో కొట్టి చంపారు.

పిచ్చి మొక్కలు తొలగించండి సారూ..

ప్రసాదం తయారీ విభాగం పక్కన దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాముల బెడద ఎక్కువైందని సిబ్బంది చెబుతున్నారు. పిచ్చి మొక్కలను తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని సిబ్బంది కోరుతున్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి భాను

ప్రత్తిపాడు: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సహాయం అందుతుందని ప్రత్తిపాడు కోర్టు న్యాయ మూర్తి కాటం భాను తెలిపారు. న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ప్రాంగాణంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా స్త్రీలు, పేదలకు అందించే సేవలను వివరించారు. పేదలకు ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. డిసెంబర్ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ పుల్లయ్య, ప్యానల్ అడ్వకేట్ బుగత శివ, సీనియర్ న్యాయవాది పిల్లి బలరాముడు పాల్గొన్నారు.